క్లుప్తంగా

ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



చిన్నకంబలూరులో నూతనంగా నిర్మితమైన రామాలయం

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరులో నూతనంగా నిర్మించిన రామాలయంలో బుధవారం ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందుకు సంబంధించి గ్రామస్తుల సమక్షంలో వేద పండితులు కలశ పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. నిర్వాహకులు తెలిపిన వివరాల మేరకు..శిథిలమైన ఆలయాన్ని దాతల సహకారంతో పునర్నిర్మించారు. రెండు రోజుల పాటు జరిగే వేడుకల్లో దేవతా మూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవం అనంతరం ప్రతిష్ఠిస్తామని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా ఎద్దుల బండ లాగుడు పోటీలు ఏర్పాటు చేశారు.

5న జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు

నంద్యాల(అర్బన్): స్థానిక రామకృష్ణా డిగ్రీ కళాశాలలోని వివేకనంద ఆడిటోరియంలో ఈ నెల 5వ తేదీన 8వ జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ తెలిపారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గోవిందరెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కంబగిరిరాజు /జ్ఞాపకార్థం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కళాశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ పాట్రియెటిక్ అంశంపై విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. 8,9,10 తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చని, ప్రవేశ రుసుం రూ.50, ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ స్కూళ్ల విద్యార్థులకు రూ.20 చెల్లించాలని చెప్పారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి కింద 2 గ్రాముల బంగారు పతకం , ప్రశంశ పత్రం, ద్వితీయ బహుమతి కింద 20 గ్రాముల వెండి పతకం అందజేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని వివరాలకు సెల్ 9966639299 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వైభవంగా పాండురంగ స్వామి కల్యాణం



రుక్మిణీ,పాండురంగస్వామి వారి కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మండలంలోని పాండురంగాపురంలో వెలసిన పాండురంగస్వామి ఆలయంలో బుధవారం శ్రీ రుక్మిణీ సమేత పాండురంగస్వామి వారి కల్యాణ మహోత్సవం భక్తులకు కనువిందు చేసింది. ఆలయంలో వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి వారికి నవగ్రహ, మన్యు సూక్త నీరాభిషేకాలు, అర్చనలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. అనంతరం పాండురంగస్వామికి 108 కళశాలతో సుగంధ ద్రవ్యాభిషేకాలు, తిరుమంజనం, హారతి, తీర్థ ప్రసాద వినియోగం, ఫల ప్రదానం కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం రుక్మిణీ సమేత పాండురంగస్వామి కల్యాణాన్ని గ్రామస్తులు వైభవంగా జరిపించారు. అనంతరం ఊయల సేవ, తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. భక్తులు వందలాదిగా పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు.

జగజ్జననీ మాతకు కుంకుమార్చన



సామూహిక సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో వెలసిన శ్రీ జగజ్జననీ ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా మూడో రోజు బుధవారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామునే అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్లరసాలతో అభిషేకించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం వేద పండితులు ముత్తులూరు ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో వందలాది మహిళలు సామూహిక సహస్ర నామా కుంకుమార్చనలో పాల్గొన్నారు. సాయంత్రం ప్రదోష పూజలు చేపట్టారు.

ఘనంగా దీని ఇజ్తెమా ప్రార్థనలు



ఈద్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

ఆళ్లగడ్డ: పట్టణంలో దీని ఇజ్తిమా ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. రంజాన్ మాసం ధార్మిక అవగాహన సదస్సులో భాగంగా బుధవారం మండల ప్రభుత్వ ఖాజీ, మత పెద్ద మహమ్మద్ జాఫర్ సాదిక్ ఆధ్వర్యంలో స్థానిక లింగందిన్నె రహదారిలోని ఈద్గాలో నిర్వహించిన దీని ఇజ్తెమాకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ముస్లిం మతపెద్దలు తరలి వచ్చి సందేశం వినిపించారు. మనిషి ధార్మిక మార్గంలో నడుచుకుంటూ ఇబ్బందుల్లో ఉన్న మానవులకు సహాయం చేస్తూ ప్రపంచ శాంతి కోరుకోవాలని సూచించారు.

పట్టణాభివృద్ధికి పెద్ద పీట

- రూ.69.71కోట్లతో మున్సిపాలిటీ బడ్జెట్ రూపకల్పన
- అన్ని వర్గాలకు సమానాభివృద్ధి
- ప్రభుత్వాల గ్రాంట్లు రూ.7.2 కోట్లకు పెంపు



అమృత్ పథకం కింద జరుగుతున్న పైప్‌లైన్ పనులపై సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణాభివృద్ధి అధిక ప్రాధాన్యతిస్తున్నామని, అన్ని వర్గాల సమానాభివృద్ధికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా, కమిషనర్ రవిచంద్రారెడ్డి బడ్జెట్ సమావేశం సందర్భంగా మంగళవారం నిర్వహించిన బడేజెట్ సమావేశంలో ప్రకటించారు. పెరుగుతున్న జనభాను దృష్టిలో ఉంచుకుని పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గతంలో ఉన్న బడ్జెట్లకు భిన్నంగా ఈ ఏడాది మిగుల బడ్జెట్‌ను రూపొందించారు. 2023-24 సంవత్సరానికి రూ. 69.71కోట్లతో అభివృద్ధికి ఊతమిచ్చేలా కేటాయింపుల చేపట్టారు. గతంలో ఉన్న పరిస్థితులకు భిన్నంగా జిల్లా కేంద్రాన్ని మరింతగా అభివృద్ధి చేసేలా రాబడులు, వ్యయాలను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ బడ్జెట్‌ను రూపొందించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ. 54.73 కోట్లకు ప్రతిపాదించగా రూ.57.73 కోట్ల రూపాయలు రివైజ్డ్ బడ్జెట్ కింద ఖర్చు చేశారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.69.71 లక్షలతో బడ్జెట్ రూపొందించగా రూ. 66.78 లక్షలు వ్యయం చేయనున్నారు. ఇందులో రూ. 2.92 కోట్ల మిగులు పొందడానికి ప్రణాళికలు రూపొందించారు.

రెవెన్యూ రాబడులను పెంచిన మున్సిపల్ అధికారులు మరింత ఆదాయాన్ని పెంచే చర్యలకు ఉపక్రమించారు. 2022-23లో రూ.42.10 కోట్ల ఆదాయం రాగా 2023-24లో రెవెన్యూ ఆదాయం రూ. 47.06 కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అలాగే.. ఖర్చులను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తూ రూ.45.82 కోట్లకు తగ్గించి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో రూ.2.17 కోట్ల నుంచి రూ.2.92 కోట్ల మిగులు సాధించనున్నారు.

జనరల్ ఫండ్స్ అలోకేషన్..

మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి ఈ ఏడాది 20.73 శాతం పెంచి పట్టణాభివృద్ధికి తోడ్పడే విధంగా బడ్జెట్‌ను రరూపొందించారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి వాటర్ సప్లయ్, డ్రైనేజ్, రోడ్లు, స్ట్రీట్ లైట్స్, రిక్రియేషన్ ఫెసిలిటీల కోసం నిధులు వెచ్చిస్తారు. అలాగే పార్కులు, కమ్యూనిటీ హాల్లు, బిల్డింగుల నిర్వహణకు ఈ ఆర్థిక సంవత్సరం 20.73 శాతాన్ని పెంచనున్నారు. ఎప్పటిలాగే ప్రజా ప్రయోజనాల నిమిత్తం, స్లమ్‌ల కోసం 40 శాతం, షెడ్యూలు క్యాస్టుల కోసం 15 శాతం, ఎస్టీల కోసం 7.50 శాతం, స్త్రీ శిశు సంరక్షణ కోసం 5 శాతం, డిసేబుల్డ్ కోసం 3 శాతం ముదింపు చేయనున్నారు.

మొత్తం రాబడులు..

	2022-23 (రూ.కోట్లలో)	2023-24 (రూ.కోట్లలో)
ప్రాపర్టీ ట్యాక్స్	19.50	20
స్టాంప్,సర్‌చార్జ్	04.5	07
14శాతం ఓపెన్ స్పేస్‌ట్యాక్స్	01.97	03.10
వాటర్ చార్జెస్	03.50	03.54
షాపింగ్ కాంప్లెక్స్	04.50	04
ఇతరములు	08.12	09.29
మొత్తం రాబడులు	42.10	47.06

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెరిగిన రాబడులు...

ప్రభుత్వం నుంచి ఈ ఆర్థిక సంవత్సరం మరింత చేయూత అందనుంది. స్థానిక సంస్థల స్వయం ప్రతిపత్తిని సాధించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా మున్సిపాలిటీలకు తోడ్పాటునివ్వనున్నాయి. 2023-24 కు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధుల రాక రూ.15.45 కోట్ల నుంచి రూ.22.65 కోట్లకు పెరిగింది. స్థానిక సంస్థల నిర్వహణ కోసం ఏటా కొన్ని గ్రాంటులను విడుదల చేయనుంది. వీటి ద్వారా మున్సిపాలిటీ మరింత సుందరీకరణ సాధ్యమవుతుంది.

బడ్జెట్‌లో ముఖ్యంగా ప్రతిపాదించిన వ్యయాలు..

ముఖ్యంగా పట్టణంలోని సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి కోసం రూ.12.20 కోట్లు వ్యయం చేయనున్నారు. అలాగే నీటి సమస్యను శాశ్వతంగా తీర్చడానికి రూ. 4.70కోట్లు మూలధన వ్యయంలో వెచ్చించనున్నారు. ఇతర వేజెస్ కోసం రూ.15.25 కోట్లు, ఎలక్ట్రిసిటీ రూ.5.75కోట్లు, ఇంధనానికి రూ.1.53 కోట్లు వెచ్చించనుండగా నీటి సప్లై మెయింటెనెన్స్ కోసం రూ.1.10 లక్షలు బడ్జెట్‌లో పేర్కొన్నారు. అలాగే సచివాలయాల అద్దెల కోసం రూ. 43.50 లక్షలు, అమృత్ పథకం లోన్‌పై వడ్డీ రూ.7.06కోట్లు, ఇతర ఖర్చుల నిమిత్తం రూ.8.96 కోట్లు వెచ్చించేలా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. మున్సిపల్ బడ్జెట్ కేటాయింపులో 5శాతం మిగులు చూపుతూ రూపొందించిన బడ్జెట్ అభివృద్ధికి దిక్సూచిలా ఉంది.

మూల ధన వ్యయం..

	2022-23 (రూ.కోట్లు)	2023-24 (రూ.కోట్లు)
సీసీ రోడ్లు, డ్రైన్లు	07.25	12.20
ఈఎస్ఆర్	01	02.70
నీటి పైప్ లైన్లు	01.55	02
ఇతరములు	05.33	04.00
మొత్తం	15.13	20.95
బ్యాలెన్స్ షీట్..		
రెవెన్యూ	42.28	47.06
మూలధనం	15.45	25.65
రివైజ్డ్ బడ్జెట్	57.73	69.71
వ్యయం	55.56	66.78
మిగులు	02.17	02.92

మూల ధన ఖర్చులు...

	2023-24 (రూ.కోట్లు)
ఆప్కాస్ వేజెస్	15.28
ఎలక్ట్రిసిటీ	05.95
ప్యూయల్	01.53
సీసీరోడ్లు మెయింటెనెన్స్	05.50
నీటి సప్లై మెయింటెనెన్స్	01.10
పబ్లిక్ టాయిలెట్స్, యూరినల్స్	00.93
సచివాలయాల అద్దె	00.43
ఇతర ఖర్చులు	08.96
అమృత్ పైన వడ్డీ	07.07
మొత్తం	45.82

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి లభించే మూలధనం..

	2022-23 (రూ.కోట్లు)	2023-24 (రూ.కోట్లు)
15వ ఆర్థిక సంఘం నిధులు	11	11 కోట్లు
అమృత్-2	0.85	01
ఎంపీ ల్యాడ్స్	0.50	0.60
గడప గడపకు మన ప్రభుత్వం	--	08.30
ఇతర గ్రాంట్లు	03.10	01.45
మొత్తం	15.45	22.65

అభివృద్ధి పనుల పరిశీలన

నంద్యాల(సిటీ): పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, కమిషనర్ రవిచంద్రారెడ్డి బుధవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ పట్టణవాసులకు నీటి ఎద్దడి రాకుండా చేస్తున్న అమృత్ పనులను పరిశీలించారు. నీటిని పంపిణీ చేసేందుకు త్వరితగతిన పైపులైన్ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేస్తున్న పార్కు పనులను కమిషనర్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పాదాచారులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు వాకింగ్ ట్రాక్‌లను పునరుద్ధరించాలని చెప్పారు. ఎంఈ రమణమూర్తి, డీఈఈ జయభారతరెడ్డి, శ్రీనివాస రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

5న హిందూ ధర్మ సమ్మేళనం

శిరివెళ్ల: ఈ నెల 5వ తేదీన గోవిందపల్లె సీతారామాంజనేయ దేవస్థానంలో హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా ప్రకండ ప్రముఖ్ వైవీ రామయ్య బుధవారం తెలిపారు. సమ్మేళనంలో భాగంగా 2 నుంచి 4వ తేదీ వరకు గుడి చుట్టు 11 నుంచి 14 సార్లు పల్లకోత్సవ, సేవా ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గరికపాటి గురజాడ,ఆధ్యాత్మిక సామాజిక ప్రవచనకర్తలు, విశ్వహిందూ పరిషత్ ముఖ్య నాయకులు పాల్గొంటారని చెప్పారు.

కేసును పూర్తిస్థాయిలో విచారించాలి

బొమ్మలసత్రం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తన కుమారుడి కేసును పోలీసులు పూర్తిస్థాయిలో విచారించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని మృతుని తండ్రి శ్రీనివాసులు బుధవారం జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డికి ఫిర్యాదు చేశాడు. 2021 సెప్టెంబర్‌లో కర్నూలుకు చెందిన తన కుమారుడు సాయిసుమన్ (27) మహానందికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా నంద్యాల శివారులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్న కొందరు వైద్యులు మద్యం మత్తులో కారుతో సాయిసుమన్ బైకును ఢీకొట్టడం వల్ల అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడన్నారు. అయితే కేసు నమోదు సమయంలో పోలీసులు నిందితుల పేర్లు మార్చారని, పూర్తిస్థాయి విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



రుద్రవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని రెండు పోలింగ్ బూత్‌లను బుధవారం శిరివెళ్ల సీఐ చంద్రబాబునాయుడు, రుద్రవరం ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు మహబుబ్‌బాషా,వీర్వోలు వెంకటరమణ, కాంత్ తదితరులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 13న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికలు జరగనున్నాయని, 39 మంది ఉపాధ్యాయులు,789 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. వారికి కల్పించాల్సిన వసతులపై చర్యలు చేపడతామని పేర్కొన్నారు. హెచ్ఎం శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

దొర్నిపాడు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జయప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు రెండు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయ ఓటర్లు 19, పట్టభద్రులు 525 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, వెంటిలేషన్ వంటి సౌకర్యాలపై హెచ్ఎం మహమ్మద్ హుసేన్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్, వీఆర్‌ఓలు సాంబశివుడు, నాగేష్ ఉన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలి

నంద్యాల(అర్బన్): గ్యాస్ ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మూడేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను విపరీతంగా పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో పెంచిన ధరలు చాలవన్నట్లు మళ్లీ ఇప్పుడు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్‌పై రూ.50, కమర్షియల్ సిలిండర్‌పై రూ.350 పెంచడం దుర్మార్గమన్నారు.

టీకాలతో గాలికుంటు వ్యాధి నివారణ

గోస్పాడు: పశుపోషకులు పశువులకు వచ్చే గాలికుంటి వ్యాధిని నివారించేందుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని జిల్లా పశు సంవర్ధ అధికారి డాక్టర్ నరసింహారావు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం పశు వైద్య కేంద్రాల ద్వారా ఈ టీకాలను పశువులకు అందజేస్తున్నట్లు తెలిపారు. పశువైద్యులు కిశోర్‌కుమార్‌రెడ్డి, ఉమాదేవి పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

శిరివెళ్ల: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం బుధవారం ఏర్పాటైంది. గౌరవాధ్యక్షులుగా గోపాల్, సలహాదారుగా శివశంకర్, అధ్యక్షుడిగా శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా షామీన్ బాస్, శ్రీనివాసారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ ఖాసిం, కోశాధికారిగా వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా తాతయ్య, ప్రమోది, సుధాకుమారి, సుధాకర్‌రెడ్డి, సర్దార్, మస్తాన్‌వలి, వెంకటరమణ, విజయకుమారి ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షుడు జాకీర్, కార్యదర్శులు జాకీర్, రామ్మోహన్, బాలస్వామి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

చికిత్స కన్నా నివారణే ముఖ్యం

ఆళ్లగడ్డ: గాలికుంటు వ్యాధి సోకిన తరువాత చేసే చికిత్స కన్నా ఈ వ్యాధి సోకకుండా నివారించడమే ముఖ్యమని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వరప్రసాద్ అన్నారు. గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రారంభించారు. టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఏడీ డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ వ్యాధి నివారణకు ముందస్తుగా ఉచిత టీకాలు నెల రోజుల పాటు వేస్తామని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



విజయదుర్గను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉయ్యాలవాడ: బ్రిటీష్ వారిని గడగడ లాడించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్రపై గేయం రచించి రేనాటి ఖ్యాతిని దేశస్థాయిలో చాటిన విజయదుర్గను బుధవారం హరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆమెను ఘనంగా సత్కరించారు. హెచ్ఎం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుభాషలో రచించిన గేయం దేశస్థాయిలో ప్రథమ బహుమతి కై వసం చేసుకోవడం తెలుగుజాతికి గర్వకారణమన్నారు. ఉపాధ్యాయులు రత్నమయ్య, మధుబాబు, కళాభూషణం, ఖాజా ఉసేన్, నాగశేషుడు, ఎదుకుమార్, రమణ, పార్వతి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించాలి



ఉపాధి సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ

రుద్రవరం: వంద రోజులకు దగ్గరగా ఉన్న కూలీలకు పనులు కల్పించాలచి వంద రోజుల కుటుంబాల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి సిబ్బందికి సూచించారు.

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమవేశం ని ర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత పెరుగుతోందని కూలీలను పని ప్రదేశానికి త్వరగా వెళ్లేలా చూడాలని చెప్పారు. అలాగే కూలీల సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు. జాబ్ కార్డు ఉండి ఆధార్ లింకు కాని వారి వివరాలు సేకరించి రెండు రోజుల్లో ఆ ప్రక్రియ పూర్తి చేయించాలని తెలిపారు. ఏపీఓ ప్రతాప్ పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

దొర్నిపాడు: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ నాగఅనసూయ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి పనులు కల్పించాలని, పనులు లేక ఎవరూ వలస వెళ్లడానికి వీలులేదన్నారు. గుర్తించిన పనులు సరిపోకపోతే మరికొన్ని పనులు గుర్తించి అప్రూవల్ చేయించుకోవాలని చెప్పారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.257 సగటు కూలి వచ్చేలా పనులు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ శేఖర్‌గౌడ్, ఈసీ సోమశేఖర్ పాల్గొన్నారు.


పోలింగ్ నిర్వహణకు పార్టీలు సహకరించాలి



రాజకీయ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ కోరారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, డీఆర్‌ఓ పుల్లయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లాలో 61 పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు, 30 ఉపాధ్యాయుల పోలింగ్ కేంద్రాలు, 3 స్థానిక సంస్థలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని..ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తామన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. ఎన్నికల ఏజెంట్లు గంట ముందే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాల్లో తమ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ఓటర్లకు ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పేపర్ బ్యాలెట్ సిస్టం ఉంటుందని, పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోను, పెన్నులు తీసుకురాకూడదని పేర్కొన్నారు. ఉదా రంగు స్కెచ్ పెన్‌తో మాత్రమే ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు ప్రవర్తించకూడదని సూచించారు. పోలింగ్ రోజు బయట ప్రాంతాల్లో ఎవరూ ప్రచారం చేయరాదని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అమృతరాజు, జాకీర్ హుసేన్, అశోక్ కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకుడు నరేంద్ర కుమార్‌రెడ్డి, సీపీఎం రమేష్‌కుమార్, సీపీఐ రమేష్‌బాబు, రంగనాయుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రియాజ్‌బాషా పాల్గొన్నారు.

రైతులు జొన్నలు విక్రయించాలి



ఈ-కేవైసీ నమోదును పరిశీలిస్తున్న ఏఓ అబ్దుల్ హక్

గోస్పాడు: ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్బీకేల ద్వారా రైతులు జొన్నలను విక్రయించుకోవచ్చని వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ తెలిపారు. మండలంలోని యాళ్లూరు, జిల్లెల్ల గ్రామాల్లోని ఆర్బీకేలను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వం గ్రామాల్లోనే జొన్న కొనుగోలు చేసేందుకు ఆర్బీకేల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. గరిష్ట మద్దతు క్వింటా ధర రూ. 2,970 అందజేస్తుందని, అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రైతులు రబీలో సాగుచేసిన ఈ-క్రాప్, ఈ- కేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీపీఐ రామకృష్ణ ముందస్తు అరెస్ట్

బొమ్మలసత్రం: విజయవాడలో గురువారం జరగబోయే మహాధర్నా నేపథ్యంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను నంద్యాల పోలీసులు బుధవారం ముందస్తు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం విజయవాడలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రయత్నిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో పట్టణంలో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రామకృష్ణ నంద్యాలకు చేరుకోవడంతో పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి రెండో పట్టణ పోలీస్టేషన్‌కు తరలించారు. ఈ సమయంలో నాయకులు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. అరెస్టను అడ్డుకునేందుకు నాయకులు పోలీస్ వాహనాన్ని నిలువరించడంతో గందరగోళానికి దారితీసింది. ఆయనతో పాటు జిల్లా నాయకులు రంగనాయుడు, రమేష్, బాబాపకృద్దీన్ తదితరులను అరెస్ట్ చేశారు.

35 ఏళ్లకు మోక్షం..



గుంతల మయంగా కొండాపురం-పేరాయిపల్లె రహదారి



తారు రోడ్డు వేసిన దృశ్యం

దొర్నిపాడు: మూడున్నర దశాబ్దాలు గడిచాయి.. కొండాపురం- పేరాయిపల్లె, గోపాలపురం గ్రామాల మధ్య రహదారి వేసేందుకు ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా, ఎంతమంది నాయకులు మారినా కనికరించలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక కొండాపుం, పేరాయిపల్లె గ్రామస్తులు ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళారు. వారు స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయించడంతో 3.7 కి.మీ. పొడవున రూ.95 లక్షలతో రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. రోడ్డు ఏర్పాటు కావడంతో దొర్నిపాడు, కొండాపురం, భాగ్యనగరం, రామచంద్రాపురం, చాకరాజువేముల, బుర్రారెడ్డి పల్లె గ్రామస్తులు నంద్యాలకు వెళ్లేందుకు మార్గం సుగుమమైంది. గతంలో వీరంతా ఆళ్లగడ్డ చేరుకొని అక్కడి నుంచి నంద్యాల వెళ్లే వారు. ప్రస్తుతం వారికి 20 కి.మీ. మేర ప్రయాణం తప్పడంతో అదనపు ఖర్చు తగ్గుతుంది. రోడ్డు పూర్తవడంతో కొండాపురం, పేరాయిపల్లె, గోపాలపురం సర్పంచులు మాధవీలత, నాగలక్ష్మమ్మ, రామలక్ష్మమ్మ హర్షం వ్యక్తం చేశారు.

జోరుగా పింఛన్ల పంపిణీ



తుడుమలదిన్నెలో పేరా సుబ్బమ్మకు పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ మంజుల, వలంటీర్

ఉయ్యాలవాడ : వైఎస్సార్ పింఛన్ కానుక పండుగ బుధవారం తెల్లవారుజాము నుంచే మొదలైంది. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పింఛన్ సొమ్ము అందజేశారు. మండలంలో 3,798 మందికి గాను మొదటి రోజు 2,926 మంచిది సొమ్ము అందజేశారు. కొందరు లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడంతో వంద శాతం పూర్తి కాలేదని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. రెండు రోజుల్లో పంపిణీ పూర్తి చేస్తామని చెప్పారు.

దొర్నిపాడు: మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ బుధవారం జోరుగా సాగింది. తొలిరోజు గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. మండలంలో 3,728 పింఛన్లకు గాను మొదటి రోజు 3,613 మందికి సొమ్ము పంపిణీ చేశారు.

నీటి సమస్య తలెత్తనీయొద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ ఆర్థర్ సైమాన్

గోస్పాడు: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఆర్థర్‌సైమాన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎండాకాలం ప్రారంభమైనందున ఎండ తీవ్రత రోజు రోజుకు పెరుగుతుందన్నారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల స్థాయి సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు ,సిబ్బంది హాజరు కావాలని, కొందరు సమావేశానికి రావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులపై పురోగతిని, నిర్వహిస్తున్న పనులను ఆయా శాఖల అధికారులు వివరించారు. సర్పంచ్‌లు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు జనార్దన్ రెడ్డి, రాజు అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.